AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com

27-8-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2



## సీపీ సాయిచైతన్యకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాఖీ పండుగను పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మకుమారీలు గురువారం పోలీస్ కమిషనర్ కు రాఖీ కట్టి , రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో శాంతి భద్రత, సోదరభావం, మానవతా విలువలను పెంపొందించడంలో పోలీస్ శాఖ చేస్తున్న సేవలను వారు కొనియాడారు. రాఖీ పండుగ సోదర-సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర రక్షణకు ప్రతీక అని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు సోదరభావంతో, శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రభుత్వ కళాశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తామని ప్రభుత్వాలు చెబుతున్నా.. ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. కాలేజీల్లో విద్యార్థులకు సరిపడ వసతులు ఉండటం లేదు. ప్రభుత్వ కాలేజీల్లో చేరాలని ప్రచారం చేస్తున్నా నాయకులు, అధికారులు వసతుల కల్పనపై దృష్టి పెట్టడం లేదు. దీంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. - అక్షరటుడే, కామారెడ్డి

# రెండు విడతల్లో క్లాసులు!



- కామారెడ్డి జూనియర్ కాలేజీలో గదుల కొరత
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- ఉదయం ఒక బ్యాచ్, మధ్యాహ్నం మరో బ్యాచ్‌కు పాఠాలు

కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరిస్థితి రోజురోజుకూ చెప్పుకోలేని స్థితికి చేరుతోంది. ప్రభుత్వ నిర్లక్ష్యానికి, నాయకుల పట్టింపులేని తనానికి ఈ కళాశాల నిదర్శనంగా మారింది. వెయ్యి మంది విద్యార్థుల అవసరాలకు తగినట్టుగా 9 కోర్సులు ఉంటే ఉన్నది మాత్రం కేవలం 10 తరగతి గదులే కావడం గమనార్హం. గదులు సరిపోకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెట్ల కింద, వరండాల్లో క్లాసులు వింటున్నారు. దీంతో కాలేజీ యాజమాన్యం తప్పనిసరి పరిస్థితుల్లో సరికొత్త విధానానికి తెర తీసింది.

### రెండు బ్యాచ్‌లుగా..

విద్యార్థుల తాకిడి పెరగడం, గదులు సరిపోక పోవడంతో కళాశాల యాజమాన్యం షిఫ్టింగ్ సిస్టమ్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఒక బ్యాచ్ విద్యార్థులకు, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు మరో బ్యాచ్ విద్యార్థులకు తరగతులు నిర్వహించనున్నారు.

### సరిపోని తరగతి గదులు

ఈ కళాశాలకు జిల్లాలోనే మంచి డిమాండ్ ఉంది. ప్రతి ఏటా అడ్మిషన్లు పెరుగుతున్నాయి. గత ఏడాది 600 మంది ఉంటే, ఈ ఏడాది ఆ సంఖ్య వెయ్యికి చేరింది. విద్యార్థులకు సరిపడా గదులు లేవు. దీనిపై విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేసినా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో చెట్ల కింద, వరండాలో, ల్యాబ్ రూముల్లోనే పాఠాలు సాగుతున్నాయి. ఒక గదిలో 60 మందికి బదులు 100 మందిని కూర్చోబెడుతున్నారు. బెంచీలు లేక చాలామంది కింద కూర్చుండి పాఠాలు వింటున్నారు.

### ఆసక్తి సన్నగిల్లే అవకాశం

యాజమాన్యం తీసుకొచ్చిన షిఫ్టుల విధానంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం చదివే విద్యార్థులకు పర్వాలేదు కానీ, మధ్యాహ్నం వచ్చే విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉంటుందని అంటున్నారు. ఎటు కాని సమయంలో వచ్చి చదవాలంటే ఏకాగ్రత ఉండదని, హాజరు శాతం కూడా గణనీయంగా పడిపోతుందని అధ్యాపకులు కూడా అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా బాలికలు మధ్యాహ్నం షిఫ్ట్ కు రావడానికి ఇబ్బందులు పడతారని, దీంతో డ్రాప్ అవుట్స్ పెరిగే ప్రమాదం పలువురు పేర్కొంటున్నారు. అదనపు గదులు నిర్మించి విద్యార్థుల ఇబ్బందులు పరిష్కరించాలని కోరుతున్నారు.

### ప్రిన్సిపాల్ అభ్యర్థన మేరకే..



కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గదుల కొరత ఉంది. దాంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్య పరిష్కారం కోసం షిఫ్టింగ్ పద్ధతిలో క్లాసుల నిర్వహణకు కళాశాల ప్రిన్సిపాల్ లేఖ రాశారు. ఆమె అభ్యర్థన మేరకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నాలుగైదు నెలలు మాత్రమే షిఫ్టింగ్ క్లాసులు జరుగుతాయి. ఆ లోపు అదనపు గదులు మంజూరు వస్తాయి. అప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– సలాం, ఇంటర్ నోడల్ ఆఫీసర్

### పట్టించుకోని నాయకులు..

కళాశాలలో వసతుల కొరతపై ఈ మధ్య విద్యార్థి సంఘాలు రోడ్డెక్కాయి. విద్యార్థులతో కలిసి నాయకులు కలిసి రాస్తారోకోలు, ధర్నాలు చేశారు. అదనపు తరగతి గదులు నిర్మించాలని, వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అయినా జిల్లా నాయకులు, అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ప్రతిపాదనలు పంపామని, నిధులు రాగానే పనులు మొదలు పెడతామని సమాధానం చెబుతున్నారే తప్ప ఆచరణలో చర్యలు శూన్యం. ప్రభుత్వ కళాశాలపై చిన్నచూపు సరికాదని, వెంటనే అదనపు గదులు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

## పారదర్శకంగా ఓటరు జాబితాలో సవరణలు జరగాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఓటరు జాబితాలో పారదర్శకంగా సవరణలు జరగాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో గురువారం ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వార్డు సభను ఆమె సందర్శించారు. వార్డు సభలో జరుగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, బీఎల్‌వోలు ఇంటిసర్వే ద్వారా సేకరిస్తున్న వివరాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఓటరు జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, సవరణలు పారదర్శకంగా, ఎలాంటి తప్పులు లేకుండా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తప్పనిసరిగా నిర్ణీత గడువులోపు తమ ధృవపత్రాలను హియరింగ్ కేంద్రంలో సమర్పించాలన్నారు. అన్ని మండలాల తహశీల్దార్లు హియరింగ్ తేదీకి ముందు గ్రామాల్లో దండోరా వేయించి, ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని, ఎవరూ మిస్‌కాకుండా చూడాలని బీఎల్‌వోలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ జీవన్, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



## మేయర్ ఉమారాణిని పరామర్శించిన టీపీసీసీ చీఫ్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగర మేయర్ ఉమారాణి తల్లి భారతి ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గురువారం 49వ డివిజన్‌లోని కసాబ్‌గల్లీలోని ఉమారాణి ఇంటికి వెళ్లారు. ఆమెను పరామర్శించారు. మాతృమూర్తి మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు.. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మేయర్ భర్త కరాటే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీచర్లపై దాడికి యత్నం.. కేసు నమోదు చేసిన పోలీసులు



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** టీచర్లపై దాడికి యత్నించిన ఘటనలో పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన నిజామాబాద్ నగరంలోని రెండో టౌన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. రెండో టౌన్ ఎస్‌హెచ్‌వో యాదగిరి గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరం లోని గర్ల్స్ స్కూల్‌లో గురువారం ఉదయం పదో తరగతి విద్యార్థిని ఛాతిలో నొప్పి రావడంతో ఉపాధ్యాయులు వెంటనే 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ క్రమంలో టీచర్లు నిర్లక్ష్యం చేశారని ఆరోపిస్తూ విద్యార్థిని మేనమామ, మేనబావలు టీచర్లపై దుర్భాషలాడారు. వారి విధులకు ఆటకం కలిగించారు. చెప్పుతో కొడతామని టీచర్లను బెదిరించడంతో వారు రెండో టౌన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో విచారించిన పోలీసులు అమ్మాయి బంధువులు పాల్ ఫిలిప్, దాస్, ఎబినేజర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సరిచూసుకోవాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు సవరణలు చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి అన్నారు. గురువారం ఆమె 38వ వార్డులో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటర్ జాబితాలో తప్పులు ఉన్నవారు, పత్రాలు నింపే సమయంలో పొరపాట్ల వల్ల ముసాయిదా జాబితాలో పేర్లు లేని వారు బీఎల్‌ఓలు నోటీసులు ఇచ్చినప్పుడు ప్రభుత్వ గుర్తింపు పొందిన 16 కార్డులలో ఏదో ఒకటి చూపించి ఓటును సరిచేసుకోవాలన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని, ఒక్క ఓటును కూడా అనవసరంగా తొలగించమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ గిరి, మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, టీపీబీఓ సాయి కిరణ్, కో ఆప్షన్ గొనె సునీత శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ చాట్ల రాజేశ్వర్, బీసీ సంఘం అధ్యక్షులు నీల నాగరాజు, నాయకులు అమీర్, మంద రాములు, వేణు, సోహిల్, రమేష్, రఘు పాల్గొన్నారు.

## భీమ్‌గల్ ఎస్సై–2గా శంకర్ బాధ్యతల స్వీకరణ





**అక్షరటుడే, భీమ్‌గల్ :** పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎస్సై2 (రెండో సబ్‌ఇన్‌స్పెక్టర్)గా శంకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆదిలాబాద్ జిల్లా టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా సేవలందించిన ఆయన, ఇటీవల జరిగిన శాఖాపరమైన బదిలీల్లో భాగంగా భీమ్‌గల్ ఠాణాకు కేటాయించబడ్డారు. బాధ్యతల స్వీకరణ అనంతరం నూతన ఎస్సై పి.శంకర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) పొన్నం సత్యనారాయణను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై పి.శంకర్ మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా చూస్తానని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని వెల్లడించారు. శాంతిభద్రతల పరిరక్షణలో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు.

## ఏడాదైనా వరద నిధుల జాడేది : మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్



**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణాన్ని వరదలు ముంచెత్తి సరిగ్గా ఏడాది గడుస్తోందని.. ఇప్పటికీ వరద నిధులు జాడ ఏమైందని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జీఆర్ కాలనీ వద్ద ఆందోళన చేపట్టారు. గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. గతేడాది ఆగస్టు 27 కురిసిన భారీ వర్షాలకు కామారెడ్డి పట్టణం మొత్తం ఆగమైందన్నారు. వరదల ఉధృతి తగ్గించడం కోసం ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి డివైడర్ కూల్చేశాడన్నారు. సీఎం వచ్చి శాశ్వత పనులు చేయిస్తానని, 15 రోజుల్లో తన కార్యాలయంలో సమావేశం నిర్వహించి నివేదిక తెప్పించుకుని నిధులు మంజూరు చేస్తానని చెప్పారని, ఇప్పటికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. కూలిపోయిన శిథిలాలు ఇప్పటికి వెక్కిరిస్తున్నాయన్నారు. వరదసాయం ప్రకటించకుండా ఏడాది కాలయాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డికి గంప గోవర్ధన్ పిండ ప్రదానం పిండ ప్రదానం చేయడానికి యత్నించారు. జీఆర్ కాలనీ వరద ప్రభావిత రోడ్డుపై పిండ ప్రదానం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య తోపులాట వాగ్వాదం చోటుచేసుకుంది. దాంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.





## అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. అట్రాసిటీ కేసుల పురోగతి పై నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ డివిజన్ల వారీగా కలెక్టర్ సమీక్షించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యల గురించి తెలుసుకున్నారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు వీలుగా పకడ్బందీగా దర్యాప్తు జరిపి పూర్తి ఆధారాలను సేకరించి సకాలంలో చార్జ్ షీట్ ఫైల్ చేయాలన్నారు. పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం, ఇతర సహాయ సహకారాల విషయంలో ఎలాంటి జాప్యం జరుగకుండా చూడాలన్నారు.

## రెండు నిమిషాల్లో యూరియా ఖాళీ.. ఆందోళన చేపట్టిన అన్నదాతలు

**అక్షరటుడే, కామారెడ్డి:** రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. యాప్ విధానం రైతులకు సరిగా అర్థం కాకపోవడంతో సకాలంలో యూరియా తీసుకోలేకపోతున్నారు. తాడ్వాయి సొసైటీలో మరోసారి యూరియా స్టాక్ రావడంతో రైతులు కోసం ఎగబడ్డారు. యాప్‌లో యూరియా (Urea) స్టాక్ ఉన్నట్టు చూపినా.. కేవలం రెండు నిమిషాల్లోనే అయిపోయింది. యూరియా నో స్టాక్ కనిపించడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయమై సొసైటీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. యాప్ వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దాంతో పోలీసులు ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు చేరుకుని సముదాయించే ప్రయత్నం చేశారు. యూరియా యాప్‌లో కాకుండా నేరుగా సొసైటీల ద్వారా సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో స్టాక్ వస్తుందని అధికారులు తెలిపారు.



## ఓట్ల తొలగింపుపై ఆందోళన వద్దు



**అక్షరటుడే, మెండోరా:** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఏ ఒక్కరి ఓటు తొలగించబడదని పోచంపాడ్ ఆర్ఐ వేణుగోపాల చారి స్పష్టం చేశారు. గురువారం మెండోరా మండలం పోచంపాడ్ గ్రామంలో ఎస్ఐఆర్‌పై నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. నోటీసులు అందుకున్న వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అధికారులు సూచించిన విధంగా అవసరమైన గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకదాన్ని సమర్పిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించేందుకే గ్రామసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా అధికారులు అందించే సమాచారాన్ని పాటించి ప్రక్రియకు సహకరించాలని సూచించారు. ఈ గ్రామసభలో సర్పంచ్ మాధురి, ఉప సర్పంచ్ సంపంగి సతీష్, రమేష్, చిన్నయ్య, బీఎల్‌వోలు, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



## మహాధర్నాకు తరలిన బాన్సువాడ డివిజన్ ఉద్యోగులు

**అక్షరటుడే, బాన్సువాడ:** జిల్లా కేంద్రంలో టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన మహా ధర్నా కార్యక్రమానికి బాన్సువాడ డివిజన్‌కు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి వారు సంఘీభావం తెలిపారు. పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను విడుదల చేయడం, ఉద్యోగులకు హెల్త్ కార్డులు అందించడం, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానంను పునరుద్ధరించడం వంటి డిమాండ్ల సాధన కోసం మహా ధర్నాలో పాల్గొంటున్నట్లు ఉద్యోగులు తెలిపారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని కోరారు. బాన్సువాడ డివిజన్ నుంచి టీఎన్జీవో డివిజన్ సెక్రెటరీ మహమ్మద్ అజీమోద్దీన్, ఉపాధ్యక్షులు చిట్టెంపల్లి రవి, సంజీవ్, భీమన్న, గంగాధర్, జబ్బార్, కాశీరాం, ధర్మన్న, మాజీద్, బాలరాజు, శంకర్ తదితరులు తరలివెళ్లారు.

## దూస్‌గావ్ ప్రభుత్వ పాఠశాలకు బెంచీల వితరణ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** దూస్‌గావ్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో బెంచీల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాఖీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులకు కొత్త బెంచీలను అందజేశారు. డిచ్‌పల్లి ఎంఈవో నరేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం హర్షణీయమన్నారు. కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ సీతయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య ఉందని వారికి సరైన ప్రోత్సాహం దొరికితే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్ ఝువార్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఎల్లప్పుడూ సమాజ సేవకే పెద్దపీట వేస్తుందన్నారు. పాఠశాల హెచ్‌ఎం భూమావతి, బెజ్జం అశోక్, దూస్‌గావ్ సర్పంచ్ సువర్ణ వెంకట్, వీడీసీ ఛైర్మన్ సాయిలు, శ్యామ్ అగర్వాల్, ప్రకాష్, అంకిత్ అగర్వాల్, నరాల సుధాకర్ పాల్గొన్నారు.

ఏళ్ల నిరీక్షణ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'చేయూత' పింఛన్లు పేదల ఆశలను చిగురింపజేస్తే.. గ్రామాల్లోని కొందరు 'చోటా మోటా' నాయకులకు అది వరంగా మారింది. దరఖాస్తు చేసుకుంటే చాలు, ఖచ్చితంగా పింఛను మంజూరు చేయిస్తామంటూ అమాయకుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. అధికార ప్రతినిధులమని, పెన్షన్లు వచ్చేలా చూస్తామని నమ్మబలుకుతూ దర్జాగా డబ్బులు వసూలు చేస్తున్నారు. – అక్షరటుడే, డిచ్‌పల్లి

# 'చేయూత' దరఖాస్తుల్లో చేతివాటం!



■ ఆన్‌లైన్ పేరుతో వసూళ్లకు తెరలేపిన వైనం.. ■ పల్లెల్లో మధ్యవర్తుల హవా

కొత్తగా చేయూత పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కావడంతో అర్హులైన పేదలు ఆశగా దరఖాస్తులు చేసుకునేందుకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకం తమకు ఆసరాగా నిలుస్తుందన్న ఆశతో ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం మీ సేవా కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. వాస్తవానికి దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే సమర్పించాలి. ఇదే అదనుగా కొందరు మధ్యవర్తులు, చోటామోటా లీడర్లు దరఖాస్తుల పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఉమ్మడిజిల్లాలో..

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఈ వ్యవహారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పథకానికి దరఖాస్తు చేసుకోవడం కోసం నిరుపేదల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తే.. అది సంక్షేమ లక్ష్యానికే విఘాతం కలిగించే పరిణామంగా మారుతుంది.

### ఆన్‌లైన్.. పేరుతోనే బాదుడు..!

చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేయించాలంటే ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు వివరాలు తదితర పత్రాలతో దరఖాస్తు పూర్తి చేసి గ్రామ పంచాయతీ, వార్డుల్లో సమర్పిస్తే సంబంధిత అధికారి సంతకం చేసి ఎంపీడీవో, మున్సిపాలిటీల్లో ఇచ్చి కార్యాలయ సిబ్బందితో ఆన్‌లైన్ చేయాలి. ప్రక్రియపై పూర్తి అవగాహన లేని వితంతువులు, దివ్యాంగులు, నిరుపేదలు ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని కొందరు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారనే విమర్శలు నెలకొన్నాయి.

### దళారుల హవా?

గ్రామీణ ప్రాంతాల్లో ఆన్‌లైన్ ప్రక్రియ తెలియని లబ్ధిదారుల తరఫున దరఖాస్తులు చేసేందుకు కొందరు మధ్యవర్తులు ముందుకొస్తున్నారు. దరఖాస్తు చేయడం నుంచి పత్రాలు స్కాన్ చేయడం, వివరాలు నమోదు చేయడం వరకు ఒక్కో సేవకు ఒక్కోరేటు నిర్ణయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆన్‌లైన్ ప్రక్రియలో సైతం దళారుల జోక్యం లేకుండా మండల అధికారులు పర్యవేక్షిస్తేనే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది.

### మచ్చుకు కొన్ని ఉదాహరణలు

**1)** నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలోని వెనుకబడిన ప్రాంతాల్లో అమాయకులైన నిరుపేదల నుంచి వసూళ్లు చేస్తున్నట్లు తెలిసింది. పింఛన్ మంజూరైతే.. ప్రతి నెలా డబ్బులొస్తాయి కదా..అని ఉప్పొంగించే మాటలు కలిపి డబ్బులు గుంజుతున్నారు.

**2)** నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని డిచ్‌పల్లి, ఇందల్వాయి, సిరికొండ మండలాల్లో కొందరు ప్రజాప్రతినిధులు మధ్యవర్తుల అవతారం ఎత్తి చేయూత దరఖాస్తుదారులకు పెన్షన్లు మంజూరు చేయిస్తామని అందినకాడికి దండుకుంటున్నట్లు సమాచారం.

**3)** కామారెడ్డి జిల్లాలోని పురపాలికల్లో అర్జీదారులకు పింఛను మంజూరు చేయిస్తామని చెప్పి పైరవీకారుల అవతారమెత్తిన నాయకులు, దళారులు డబ్బు వసూలు చేస్తున్నారు. మధ్యవర్తులు ఉదయం నుంచి రాత్రి వరకు ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో తిష్ట వేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

### అధికారుల నిఘా అవసరం

చేయూత దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలపై సంబంధిత శాఖల అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తే అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయవచ్చు. దరఖాస్తుల సంఖ్య, వసూలు చేసిన రుసుములు, ఇచ్చిన రసీదులు, లబ్ధిదారుల ఫిర్యాదులను పరిశీలించాలి. అలాగే గ్రామాల వారీగా ఎన్ని దరఖాస్తులు వచ్చాయి.. ఎంతమంది అర్హులుగా గుర్తించారు.. ఎన్ని తిరస్కరించారు.. తిరస్కరణకు కారణాలేమిటి అనే వివరాలను పారదర్శకంగా వెల్లడిస్తే మధ్యవర్తుల దందాకు అవకాశం తగ్గుతుంది.

### 'చేయూత'.. పేదలకు అండగా నిలవాలి

ప్రభుత్వ సంక్షేమ పథకం ఉద్దేశం పేదలకు ఆర్థిక భరోసా కల్పించడం. కానీ దరఖాస్తు దశలోనే మధ్యవర్తుల చేతుల్లో పేదలు డబ్బులు కోల్పోతే.. పథకం ఉద్దేశానికే ప్రమాదకరం. అందుకే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో చేయూత దరఖాస్తుల ప్రక్రియపై ప్రత్యేక నిఘా, ఆకస్మిక తనిఖీలు, ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


## ఎస్ఐఆర్‌పై జోరుగా గ్రామ సభలు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎస్ఐఆర్ -2026 ప్రక్రియలో భాగంగా జిల్లావ్యాప్తంగా వార్డ్, గ్రామ సభలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు కలెక్టర్ అన్ని మండలాల తహశీల్దార్లు గ్రామ సభలను పక్కాగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు వచ్చేలా చర్యలు తీసుకునేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ గ్రామ సభల్లో డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను ప్రజల సమక్షంలో చదివి వినిపించడంతో పాటు ఓటర్లు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకునే అవకాశం కల్పించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తప్పనిసరిగా నిర్ణీత గడువులోపు తమ ధృవపత్రాలను హియరింగ్ కేంద్రంలో సమర్పిస్తేనే ఓటు హక్కుకు అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అన్ని మండలాల తహశీల్దార్లు హియరింగ్ తేదీకి ముందు గ్రామాల్లో దండోరా వేయించి, ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. అనవసరపు పుకార్లను నమ్మవద్దని, ప్రతి ఓటరు గ్రామ సభకు హాజరై జాబితాలో తన వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు.



## పోచంపాడ్ హైస్కూల్‌లో ఆకతాయిల విధ్వంసం





**అక్షరటుడే, పోచంపాడ్:** మెండోరా మండలం పోచంపాడ్ గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో గుర్తుతెలియని వ్యక్తులు విధ్వంసానికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. సెలవుల కారణంగా పాఠశాల మూసి ఉండటాన్ని ఆసరాగా చేసుకుని రాత్రి సమయంలో పాఠశాలలోకి ప్రవేశించి ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తోంది. పాఠశాలలోని పలు క్లాస్‌రూమ్‌లలో విద్యార్థులు ఏర్పాటు చేసిన చార్టులు, ప్రాజెక్టులకు సంబంధించిన పేపర్లు, ఇతర విద్యా సామగ్రిని చింపివేశారు. ఒక తరగతి గదిలో ఫ్యాన్లను ధ్వంసం చేయగా, మరో క్లాస్‌రూమ్‌లో బల్బులను పగులగొట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో శ్రమించి సిద్ధం చేసిన విద్యాసామగ్రి ధ్వంసం కావడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఆస్తులు, విద్యార్థుల విద్యాసామగ్రి పరిరక్షణకు గ్రామ ప్రజలు, గ్రామ కమిటీ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాఠశాల పరిసరాల్లో నిఘా పెంచాలని, అనధికారికంగా పాఠశాలలోకి ప్రవేశించి విధ్వంసానికి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధరంపూరి సురేందర్, నజీముద్దీన్ వివరాలు సేకరిస్తున్నారు.

## ఎల్లారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలో గురువారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అన్నాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఈరోజు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ స్రవంతి సాయగౌడ్, ఉప సర్పంచ్ నాగరాజు హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. సర్పంచ్ స్రవంతి సాయగౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా రేషన్ సరుకులు అందుతాయని, అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, జీపీవో సావిత్రి, వీవోఏ ఆంజనేయులు, రేషన్ షాప్ డీలర్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## బాన్సువాడలో ఘోరం.. లారీ ఢీకొని విద్యార్థిని మృతి



**అక్షరటుడే, బాన్సువాడ:** పాఠశాలకు వెళ్తున్న ఏడేళ్ల బాలికను లారీ ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషాదకర ఘటన పట్టణంలోని తాడ్కోల్ చౌరస్తా వద్ద గురువారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. లారీ డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ పాఠశాలకు వెళ్తున్న బాలికను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బాలిక లారీ టైర్ల కింద పడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాలిక మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి రోదనలు అక్కడున్న వారిని కంటతడి పెట్టించాయి. ఈ ఘటనతో బాన్సువాడ పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడు మృతి

**అక్షరటుడే, బాన్సువాడ:** ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడు మృతి చెందాడు. బాన్సువాడ-కొత్తబాది ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బాన్సువాడ వైపు నుంచి కొత్తబాది వైపు బైక్‌పై వెళ్తున్న కొత్తబాది గిర్ని తండాకు చెందిన పాల్యా రాజు (28) మొగలాన్‌పల్లి గ్రామ శివారులోని ఎన్‌హెచ్ 765డీ జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారని, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న బాన్సువాడ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. రోడ్డు పక్కన ఎలాంటి లైట్లు లేకుండా ట్రాక్టర్ నిలిపి ఉంచడం వల్ల ప్రమాదం జరిగిందా, లేక ద్విచక్ర వాహనం అతివేగమే ప్రమాదానికి కారణమా అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

## ఎట్టకేలకు కల్వర్టు పనులకు శ్రీకారం

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఎట్టకేలకు పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో కల్వర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎనిమిదేళ్ల క్రితం మహాలక్ష్మి కాలనీ నుండి హౌసింగ్ బోర్డ్ కాలనీ వరకు బీటీ రోడ్డు నిర్మించారు. అయితే బీటీ రోడ్డు ఎత్తుగా రావడంతో రోడ్డు పక్కన ఉన్న ఇళ్లన్నీ డౌన్ అయ్యాయి. వర్షాలు కురిసినప్పుడల్లా వరద నీరు భారీగా వచ్చి చేరి సరైన కల్వర్టు లేకపోవడంతో వరద నీరు ఇళ్లలోకి చేరేది. దీంతో కాలనీవాసులతో వర్షా కాలం వచ్చిందంటే తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. రాజకీయ నాయకులు, అధికారుల చుట్టూ తిరుగుతూ వరద ప్రభావ ఇళ్ల యజమానులు వినతిపత్రాలు సమర్పించారు. ఆగస్టు 5న 'అక్షరటుడే'లో 'వర్షం వస్తే భయమే..' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలో కల్వర్టు నిర్మాణానికి నిధుల కేటాయించి టెండర్ ప్రక్రియ పూర్తిచేసిన అధికారులు ప్రస్తుతం పనులు చేపట్టారు. కల్వర్టు పనులు ప్రారంభం కావడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణానికి కృషిచేసిన స్థానిక కౌన్సిలర్ యామాద్రి కవిత భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


అక్షర టుడే
వర్షం వస్తే భయమే..
కల్వర్టు నిర్మాణం చేపట్టాలి..
కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇచ్చాం

